క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సాయం



మానవపాడు: మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీలో జగ్గుల శివరాజ్ (30) గుండెపోటుతో ఈనెల 19న మృతి చెందాడు. సోమవారం వారి కుటుంబ సభ్యులను 2008–09 బ్యాచ్ పదో తరగతి స్నేహితులు పరామర్శించారు. అనంతరం రూ.22 వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసానిచ్చారు. కార్యక్రమంలో గ్రామస్తులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా ప్రారంభమైన ఉర్సు



అయిజ: మండలంలోని కిష్టాపురం గ్రామంలో హజరత్ అలీ సాహెబ్ ఉర్సు వేడుకలు సోమవారం రాత్రి గంధం కార్యక్రమంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. మంగళవారం ఉర్సు, బుధవారం కిస్తీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు దర్గా కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కేంద్రాలు సమర్థవంతంగా నిర్వహించాలి

మల్దకల్ : అంగన్‌వాడీ కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ నాగరాణి అన్నారు. సోమవారం మల్దకల్‌లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్ వాడీ కేంద్రాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు ఎత్తు, బరువు తక్కువగా ఉన్న చిన్నారుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధను తీసుకోవాలన్నారు. పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్, అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

మల్దకల్ : అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి రాజశేఖర్ ఫర్టిలైజర్ నిర్వాహకులను హెచ్చరించారు. సోమవారం స్థానిక ఫర్టిలైజర్ షాపులను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎరువులను విక్రయించిన వెంటనే రసీదులు అందజేయాలన్నారు. అనంతరం మల్దకల్‌లోని మొక్కజొన్న పంటను పరిశీలించారు. కార్యక్రమంలో ఏఈఓలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ



గట్టు : మండల పరిధిలోని బల్గెర గ్రామంలో సోమవారం పేద విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ చేశారు. భవిష్య భారత్, ఎల్‌టీఐ మైండ్‌ట్రీ సంస్థ ఆధ్వర్యంలో పేద విద్యార్థినులకు పంపిణీ చేశారు. అనంతరం జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ ప్రాజెక్ట్ మేనేజర్ బాలరాజు, లైవ్లీ హుడ్ అధికారి వెంకటేశ్వర్లు, హరికృష్ణ, బల్గెర ప్రతాప్, హలీంపాష, లక్ష్మన్న, వాల్మీకి, పార్వతి, పరమేష్, గ్రామ నాయకులు బాసుగోపాల్, రామకృష్ణ, ఉపాధ్యాయుడు రఘు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

బంగారు హారం బహూకరణ



అయిజ: మండల కేంద్రంలో కొలువైన అయ్యప్ప స్వామి వారికి భక్తులు 9 తులాల బంగారు హారాన్ని సోమవారం హైదరాబాద్‌లో కొనుగోలు చేశారు. అదే విధంగా పంచలోహంతో అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. జనవరి 1న పంచలోహ విగ్రహంతో పాటు, బంగారం హారానికి మండల కేంద్రంలో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

ఆసక్తి పెంచేలా బోధన ఉండాలి

గద్వాలటౌన్ : గణితం అంటే విద్యార్థుల్లో కొంత భయాందోళన ఉంటుందని, వారికి ఆసక్తి పెంపొందించేలా అధ్యాపకులు బోధన ఉండాలని డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చంద్రమోహన్ అన్నారు. జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం స్థానిక ఎంఏఎల్‌డీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్య జీవితంలో గణితం అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమన్నారు. గణితం అన్ని సబ్జెక్టులకు తల్లివంటిదన్నారు. రామానుజన్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు సత్యన్న, రాధిక, వెంకటేశ్వరమ్మ, కృష్ణయ్య, వెంకటేశం, గణేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకింగ్ రంగంపై అవగాహన..

ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 'డిపాజిటర్ ఎడ్యుకేషన్ అండ్ అవేర్‌నెస్ వర్క్‌షాప్' నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మీనాక్షీ మాట్లాడారు. బ్యాంకింగ్ రంగంలో వస్తున్న సమకాలీన మార్పులు, సాంకేతికపరమైన మార్పుల వల్ల కలిగే లాభనష్టాల గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసాద్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

38 రకాల గణిత ప్రదర్శనలు..

మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జాతీయ గణిత దినోత్సవాన్ని పురస్కరించుకుని 38 రకాల గణిత ప్రదర్శనలు ప్రధానోపాధ్యాయుడు విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు 2డీ, 3డీ చిత్రాలు, ప్రోగ్రామ్స్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రదర్శనలు ప్రదర్శించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. గణితశాస్త్ర ఉపాధ్యాయులు నాగరజిత, శైలజలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గద్వాల డిగ్రీ కళాశాలలో రామానుజన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు



జల్లాపురంలో నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి



సర్వే చేస్తున్న అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ రామకృష్ణ



కేటీదొడ్డిలో ఇంటింటి సర్వేను పరిశీలిస్తున్న నల్లా హనుమంతు

కేటీదొడ్డి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని మార్కెట్ యార్డ్ చైర్మన్ కుర్వ నల్లా హనుమంతు అన్నారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న సర్వే హనుమంతు పరిశీలించారు. యాప్ ద్వారా సర్వే చేపట్టాలన్నారు. ఇందిరమ్మ పథకం కింద పూర్తి స్థాయి అర్హత గల నిరుపేద కుటుంబాలకు ఇళ్లను అందజేసే లక్ష్యంతో సర్వే చేయాలన్నారు. ప్రజా పాలనలో వచ్చిన దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఉరుకుందు, కొండన్న, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తులు క్షుణ్ణంగా పరిశీలించాలి..

శాంతినగర్ : ఇందిరమ్మ ఇళ్ల సర్వే పకడ్బందీగా నిర్వహించాలని ఎంపీడీఓ రామకృష్ణ అధికారులకు సూచించారు. వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమర్సు, రామాపురం, తిమ్మాజిపల్లి గ్రామాల్లో నిర్వహిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే కార్యక్రమాన్ని ఎంపీడీఓ సోమవారం పరిశీలించారు. ప్రభుత్వం సూచించిన వివరాలు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీఓ ప్రవీణ్ కుమార్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ధరూరు : మండల కేంద్రంలో అనారోగ్యంతో మృతి చెందిన చాకలి తిమ్మక్క(55) కుటుంబ సభ్యులను మండల సీనియర్ కాంగ్రెస్ నేత బండ్ల చంద్రశేఖర్‌రెడ్డి పరామర్శించారు. ఈ సందర్భంగా తిమ్మక భౌతికదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తోడుగా ఉంటామని హామీనిచ్చారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ సవారన్న, వెంకటేష్, కోతులగిద్ద కర్రెప్ప, ఆంజనేయులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయించాలి

అలంపూర్ : క్రీడల అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే విజయుడు కోరారు. హైదరాబాద్‌లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అధికార ప్రతినిధి, రాష్ట్ర ఒలంపిక్ సంఘం అధ్యక్షుడు ఏపీ జితేందర్ రెడ్డిని సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. అలంపూర్ నియోజకవర్గంలో క్రీడా అభివృద్ధికి నిధులు కేటాయించాలని వినతి పత్రం అందజేశారు. మండల కేంద్రాల్లో మినీ స్టేడియాలు నిర్మించాలన్నారు. గ్రామాల్లో నైపుణ్యం ఉన్న క్రీడాకారులు ఉన్నప్పటికీ క్రీడా ప్రాంగణాలు, సౌకర్యాలు లేక క్రీడలకు దూరం అవుతున్నారని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న సీఎం కప్ క్రీడా పోటీల్లో విద్యార్థులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రతిభ కనబర్చి పతకాలు సాధిస్తున్నట్లు పేర్కొన్నారు. సానుకూలంగా స్పందించిన ఆయన నిధులు కేటాయిస్తామని భరోసా ఇచ్చినట్లు పేర్కొన్నారు.

స్పీకర్‌ను కలిసిన ఎమ్మెల్యే

అలంపూర్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఎమ్మెల్యే విజయుడు సోమవారం కలిశారు. అసెంబ్లీ చాంబర్ వద్ద ఎమ్మెల్యేతోపాటు నాయకులు నరేందర్‌రెడ్డి, రవి రెడ్డి, శ్రీను స్పీకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. వివిధ అంశాలపై ఆయనతో మాట్లాడినట్లు తెలిపారు. అదే విధంగా అసెంబ్లీ ప్రాంగణంలో మాజీ ప్రధాని పీవీ నరసింహారావు వర్ధంతిని సోమవారం నిర్వహించగా.. స్పీకర్, మంత్రులతోపాటు ఎమ్మెల్యే విజయుడు నివాళ్లు అర్పించారు.



స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌తో నాయకులు

అమిత్‌షాను బర్తరఫ్ చేయాలి

ఇటిక్యాల: కేంద్ర మంత్రి అమిత్‌షాను పార్లమెంట్ సభ్యత్వం నుంచి బర్తరఫ్ చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. బహుజన్ సమాజ్ పార్టీ ఆదేశాల మేరకు పార్లమెంట్‌లో డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అమిత్‌షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మంగళవారం జిల్లా కేంద్రంలోని వైఎస్ఆర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అంతటి నాగన్న హాజరవనున్నట్లు తెలిపావరు. ఈ సందర్భంగా బీఎస్పీ నాయకులు, అంబేద్కర్ వారసులు, వివిధ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పీవీకి ఘన నివాళి



ఎర్రవల్లి: మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ ఆధ్వర్యంలో మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి నాయకులతో కలిసి ఎర్రవల్లి కూడలిలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలు కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు రుక్మాందర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, వెంకటన్న, రాజ్‌కుమార్, పెద్ద మద్దిలేటి, వెంకటేష్, అల్లబకాష్, బజారి తదితరులు పాల్గొన్నారు.

చంపేశారా.. చనిపోయాడా?

ఉండవెల్లి: మండలంలోని బైరాపురం శివారులోని అలంపూర్ రైల్వే స్టేషన్ మార్గంలో ఈనెల 21న గుర్తు తెలియని మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అదే రోజు పోలీసుల పర్యవేక్షణలో డీఎస్పీ సత్యనారాయణ పరిశీలించారు. మృతదేహాన్ని గుర్తుపట్టలేకపోయారు. సరిహద్దు ప్రాంతం కావడంతో ఆంధ్ర పోలీసులకు సమాచారం అందించి, సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. పోలీసులు క్లూస్ టీం, డాగ్స్ టీంతో పరిశీలించిన ఫలితం లేకుండా పోయింది. చనిపోయాడా, చంపేశారా అనేది ఇంత వరకు తేలక పోవడంతో పోలీసులు సతమతమవుతున్నారు. గుర్తు తెలియని మృతదేహం వివరాలు కోసం దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రవిబాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

యువత సన్మార్గాన్ని ఎంచుకోవాలి



ధరూరు ఎంబీ చర్చిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, యువకులు

ధరూరు : యువత చెడు మార్గాన్ని వీడి సన్మార్గంలో నడవాలని పాస్టర్ సీపీ ప్రసాద్ యూధా అన్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని ఎబీ షాలేం చర్చిలో క్రిస్మస్ పర్వ దినాన్ని పురస్కరించుకుని టీచర్ రాజేష్ ఆధ్వర్యంలో యూత్ క్రిస్మస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మారుతున్న పరిణామాల నేపథ్యంలో రానురాను పెడదోవ పడుతున్న వారి సంఖ్య పెరుగుతోందన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో సంఘ పెద్దలు విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ సంబరాలు

ఎర్రవల్లి: మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో సోమవారం కరస్పాండెంట్ మధుశికరెడ్డి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు మేరీ, శాంతాక్లాస్, దేవదూతల వేషధారణలో అలరించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. చిన్నారులు నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు

ఆటోను ఢీకొట్టిన ట్రక్



ఉండవెల్లి: మండలంలోని ఇటిక్యాలపాడు శివారులోని జాతీయ రహదారిపై కర్నూల్ నుంచి ప్రయాణిస్తున్న కూరగాయల ఆటోను వెనుక నుంచి టాటా ఇంట్రా ట్రక్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ముగ్గురు గాయపడ్డారు. గాయపడిన వారిని హైవే అంబులెన్స్‌లో కర్నూల్ జనరల్ ఆసుపత్రి తరలించినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన వారు వెంకటమ్మ, లక్ష్మి, షాలుగా గుర్తించారు.

నేటి నుంచి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



మాచర్ల శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయం



స్వామివారి మూలవిరాట్టు

గట్టు : మండల పరిధిలోని మాచర్ల గ్రామంలో చెరువు కట్ట వద్ద వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు బ్రహ్మోత్సవాలకు సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం ఉదయం స్వామి వారికి ప్రత్యేక పూజలు అనంతరం చెన్నకేశవస్వామి, లక్ష్మీదేవి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. సాయంత్రం స్వామి వారి ఆలయం నుంచి ఆంజనేయస్వామి దేవాలయం వరకు పల్లకి సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాత్రికి ప్రభోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. బుధవారం ఉదయం స్వామి వారికి పంచామృత అభిషేకం, పల్లకి సేవ, రథోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. మాచర్ల జాతరకు కర్ణాటకతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలిరానున్నట్లు పేర్కొన్నారు.

వివేకానంద నూతన కమిటీ ఎన్నిక

అలంపూర్ : పట్టణంలోని వివేకానంద కార్యాలయంలో శ్రీ వివేకానంద యూత్ సొసైటీ మండల నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగినట్లు సభ్యులు తెలిపారు. కమిటీ అధ్యక్ష, కార్యదర్శులను, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా పోలీస్ చిన్నయ్య, గౌరవ సలహాదారులుగా నాగమల్లయ్య, హనుమంతు రావు, అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు(బుజ్జీయాదవ్) ఉపాధ్యక్షురాలిగా కామాక్షి, ప్రధాన కార్యదర్శిగా ఎంబీ సంజీవ నాయుడు, సంయుక్త కార్యదర్శిగా కరుణిందర్, కోశాధికారిగా ముస్తఫా, ప్రచార కార్యదర్శిగా ప్రశాంత్ యూత్ సొసైటీ అడ్వైజరీ కమిటీ సభ్యులుగా బీసన్న, సర్వేశ్వర్, కామాక్షి, లీగల్ అడ్వైజర్లుగా అడ్వకేట్లు నాగరాజు యాదవ్, వెంకటేష్‌ను ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులను సత్కరించారు. కార్యక్రమంలో సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు

'నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు'

అయిజ: ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రంలో కొందరు నిర్వాహకులు నిబంధనలు ఉల్లంఘిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ నాయకులు, రైతులు ఆరోపిస్తున్నారు. సోమవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. అయిజ మండల పరిధిలోని పులికల్ గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో అవకతవకలు జరుగుతున్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్వింటాలు ధాన్యానికి అదనంగా 2 కేజీలు తీసుకుంటున్నారని తెలిపారు. గన్నీ బ్యాగులు కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిలువచేసి కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు మాత్రమే ఇస్తున్నారని ఆరోపించారు. సామాన్య రైతులకు గన్నీ బ్యాగులు ఇవ్వకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని వెల్లడించారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పల్లయ్య, రామాంజనేయులు, వివిధ గ్రామాల రైతులు పాల్గొన్నారు.



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

పత్తి సకాలంలో కొనుగోలు చేయాలి

ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై ఉన్న సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి పుష్పమ్మ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సకాలంలో పత్తి కొనుగోలు చేయాలని అధికారులకు సూచించారు. సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రం మూడు రోజులు బంద్ కావడంతో సోమవారం రైతులందరూ పత్తి వాహనాలతో సీసీఐకు రావడంతో వాటిని ఆమె పరిశీలించారు. జిల్లా కలెక్టర్‌కు సీసీఐ కొనుగోలు కేంద్రంలో డబ్బులు వసూలు చేస్తున్నట్లు కొందరు రైతులు సమాచారం ఇవ్వడంతో వెంటనే ఆమె నిర్వాహకులతో మాట్లాడారు. అధికారులు ఎవరూ డబ్బు వసూలు చేయడం లేదని జిల్లా అధికారిని పుష్పమ్మ తెలిపారు. అనంతరం పత్తి తేమ శాతాన్ని పరిశీలించి, రైతులతో మాట్లాడి అందరి పత్తిని కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ కార్యదర్శి ఎల్లస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.



సీసీఐ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా అధికారి పుష్పమ్మ

కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలి

ఎర్రవల్లి: వైద్య ఆరోగ్య శాఖలో ఎన్నో ఏండ్లుగా పని చేస్తున్న ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బందిని క్రమబద్ధీకరించాలని సామాజిక విప్లవకారుడు డాక్టర్ ప్రేమ్ కుమార్, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు శ్రీకృష్ణ సోమవారం రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకి వినతిపత్రం అందజేశారు. హైదరాబాద్‌లోని మంత్రి చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. కరోనా సమయంలో ప్రజలకు చేసిన సేవలు గుర్తించి ఆరోగ్య శాఖలో ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, ఏఎన్ఎమ్, తదితర సిబ్బందిని వెంటనే క్రమబద్ధీకరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న సామాజిక నాయకులు

మెనూ ప్రకారం భోజనం అందించాలి

ధరూరు : విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని మండల ఇన్‌చార్జి ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు

కేవీపీఎస్ ఆధ్వర్యంలో చీరల పంపిణీ

అమరచింత: క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని కేవీపీఎస్ ఆధ్వర్యంలో నిరుపేద క్రైస్తవ మహిళలకు సోమవారం చీరలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్ఈ శ్యాంసుందర్ మాట్లాడుతూ కొన్నేళ్లుగా కేవీపీఎస్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగానే క్రిస్మస్ పండుగ రోజు పేద క్రైస్తవ మహిళలు నూతన వస్త్రాలు లేక సంతోషానికి దూరం కాకూడదనే ఉద్దేశ్యంలో వారందరికీ చీరలు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అమరచింత పట్టణంలోని మహిళలకే కాకుండా మండలంలోని ఆయా గ్రామాల్లోని నిరుపేదలకు చీరలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో పాస్టర్ హ్యాపీపాల్, అజయ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు సీఎం కప్ క్రీడల్లో కబడ్డీ ఖోఖో, బ్యాడ్మింటన్, అథ్లెటిక్స్, ఫుట్‌బాల్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పీఈటీ అరుణతార ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీల్లో కబడ్డీలో శభన, ఖోఖోలో యోచన, బ్యాడ్మింటన్‌లో మల్లిక, ఫుట్‌బాల్‌లో సమీర, మేఘన అథ్లెటిక్స్‌లో అనుషా, ఫిరియేజ్, థస్లీమా ఎంపికైనట్లు పేర్కొన్నారు.